ఎన్‌టిఆర్ శత జయంత్యుత్సవ సభ ఏర్పాట్లు పరిశీలన

పరిశీలిస్తున్న నేతలు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలో ఈ నెల 14న నిర్వహించనున్న ఎన్‌టిఆర్ శత జయంత్యుత్సవ జిల్లాస్థాయి సభ ఏర్పాట్లను టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మంగళవారం పరిశీలించారు. బిబర్తీ ఫ్యాక్టరీకి ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పాల్గొన్న బహిరంగ సభ ఇక్కడే నిర్వహించారు. ఏర్పాట్ల పరిశీలనలో పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు (కలవపూడి రాంబాబు), టిడిపి నేతలు జి.నాగేశ్వరరావు, తోట ఫణిబాబు, వీరవల్లి శ్రీనివాస్, కె.వెంకట్రావు, నంది రాజు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆధునికీకరణ..!



- ఏప్రిల్ 30న కాలువలు మూసివేత
- అయినా పనులకు దక్కని ప్రభుత్వ ఆమోదం
- పెండింగులో దాదాపు రూ.వెయ్యి కోట్ల విలువైన పనులు
- వైసిపి ప్రభుత్వం వచ్చాక ఒక్క పనీ చేయని పరిస్థితి
- కేవలం మెయింటెనెన్స్ పనులకే పరిమితం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డెల్టా ఆధునికీకరణ పనులను ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించేసింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక గడిచిన నాలుగేళ్లలో ఆధునికీకరణకు సంబంధించిన పనులను పట్టించుకోని దుస్థితి నెలకొంది. దీంతో ప్రతియేటా రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ప్రతియేటా అధిక వర్షాలకు పంటలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం ఆధునికీకరణ పనుల గురించి పట్టించుకోవడం లేదు. వైసిపి ప్రభుత్వానికి ఇదే ఆఖరి ఏడాది కావడంతో ఈసారైనా ఆధునికీకరణ పనులు జరుగుతాయని అంతా భావించారు. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఏప్రిల్ 30న కాలువలకు సాగునీరు విడుదల నిలిపివేశారు. మళ్లీ జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నారు. ఈ నెల రోజుల్లో కాలువల పూడికతీత, గేట్లకు సంబంధించిన స్ట్రక్చర్ పనులు వంటివి పెద్దఎత్తున జరగాల్సి ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు రూ.వెయ్యి కోట్లు విలువైన ఆధునికీకరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ప్రతియేటా మాదిరిగా ఈసారీ ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులూ రాలేదు. దీంతో వేసవిలో కాలువల ఆధునికీకరణ పనులు అనేవి జరగని పరిస్థితి ఉంది. జిల్లాలో 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా ఉమ్మడి జిల్లాలోని 5.29 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. గడిచిన నాలుగేళ్లుగా కాలువలకు సంబంధించి ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ఎక్కడికక్కడే పూడుకుపోయాయి. కాలువలపైన ఉన్న డ్యామ్‌లకు సంబంధించి షట్టర్లు వంటివి పూర్తిగా పాడైపోయాయి. ఈ పనులు త్వరితగతిన చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కేవలం ప్రతియేటా మెయింటెనెన్స్ పనులతో మమ అనిపిస్తోంది.

ఏటా వేలాది ఎకరాల్లో పంట నష్టం

ప్రతియేటా ఖరీఫ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో పెద్దఎత్తున పంటనష్టం వాటిల్లుతోంది. దీనికి ప్రధాన కారణం కాలువలు మెరకదేరిపోవడమే. ఆధునికీకరణ లేకపోవడంతో కాలువల గుండా వర్షపు నీరు కిందకు పారడం లేదు. దీంతో పొలాల్లో నీరు నిలిచిపోయి పెద్దఎత్తున పంట నష్టం జరుగుతోంది. నారుమడుల సమయంలోనూ, నాట్లు తరుణంలోనూ రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.ఆరు వేలు నష్టపరిహారం కింద ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. రబీలోనూ సాగునీటి ఎద్దడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల మందికిపైగా కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 75 శాతం కౌలురైతులే చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం కౌలురైతులకు అందడం లేదు. దీంతో వాస్తవ సాగుదారులైన కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆధునికీకరణ పనులు జరిగితే వర్షాలకు జరిగే పంటనష్టం నుంచి రైతులు బయటపడే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా ఆధునికీకరణ పనులను నాలుగేళ్లుగా పూర్తిగా అటకెక్కించేసింది. వచ్చే వేసవిలో సాధారణ ఎన్నికలు జరగనుండటంతో ఆధునికీకరణ పనులపై ఇక ఆశలు వదులుకోవాల్సిందేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న నేతలు

తడిచిన ధాన్యం కొనాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

అకాల వర్షాల వల్ల తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, రైతులకు కావాల్సిన సంచులు, బరకాలు వెంటనే అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వర్షాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పి.ఎన్.డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలని, రైతులకు కావాల్సిన సంచులు, బరకాలు ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. ధాన్యం గట్టు మీదకు చేర్చిన వారికి సంచులు ఇవ్వకపోవడం వల్ల తడిచి ముద్దయిందన్నారు. పంట నష్టపరిహారం కౌలుదారులకే ఇవ్వాలని కోరారు. ధాన్యాన్ని తోలడానికి ఆన్‌లైన్‌లో దగ్గర ఉన్న రైస్ మిల్లులకు కాకుండా చాలాదూరంగా ఉన్న రైస్‌మిల్లులకు వస్తుందని, దీన్ని సరి చేయాలని సూచించారు. లారీలు, ట్రాక్టర్లకు కిరాయి రైతులు ఇవ్వాల్సి వస్తుండటంతో ఖర్చు అధికి మోపెడవుతోందన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, అడ్డగర్ల అజయకుమారి, వెంకట్రావు, శ్రీహరి పాల్గొన్నారు.

వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ముఖ్యంగా వరి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. మాసూళ్లకు వచ్చిన పంట, ధాన్యపు రాశులు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఈ నష్టానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. సకాలంలో తగినన్ని సంచులు ఇవ్వడం, మాసూళ్లకు వచ్చిన ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయకపోవడం, వాహనాలు సమకూర్చకపోవడం, నిబంధనలు, షరతులు పెట్టి కొంతమేర కొనుగోలుకు మాత్రమే ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. దీంతో రైతులు అన్నివిధాలా నష్టపోయారన్నారు. ఈ నష్టానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. తడిచిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి మద్దతు ధరకు ప్రభుత్వమే తక్షణం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ఆక్వా రైతులను, ఉప్పు రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో ఈదురుగాలులకు ఉద్యాన, కూరగాయల పంటలు, గోదావరి లంక భూముల్లో తమలపాకు రైతులు నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన వివరాలను వెంటనే సేకరించి, రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని బలరాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పురస్కారం అందుకున్న లక్ష్మీనారాయణ

'చూడచక్కని చిత్రం'కు దాసరి స్మారక పురస్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు గ్రామానికి చెందిన లఘు చిత్రాల దర్శకుడు అడబాల లక్ష్మీనారాయణ దర్శకత్వంలో అడబాల రామకృష్ణుడు నిర్మాతగా నిర్మించిన లఘుచిత్రం 'చూడచక్కని చిత్రం'కు దాసరి ఫిల్మ్ అవార్డు లభించింది. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ఫిల్మ్ అవార్డు కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం చేశారని దర్శకుడు లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. సినీ దర్శకులు వివి.వినాయక్, తమ్మారెడ్డి భరద్వాజ, సి.కళ్యాణ్, హీరోలు శ్రీకాంత్, ఆలీ సమక్షంలో ఈ అవార్డును స్వీకరించామన్నారు. గతంలో ఈయన దర్శకత్వం వహించిన చిరునవ్వుల్లో చిత్రం క్షీరాపురి ఫిల్మ్ కాంటెస్ట్‌లో ఉత్తమ ఫిల్మ్‌గా ఎంపికైంది. రాయకుదురు గ్రామంపై రచించిన 'చరిత్రలో మా ఊరు' అనే పుస్తకాన్ని ప్రముఖ రచయిత, నటులు తనికెళ్ల భరణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవార్డుగ్రహీత లక్ష్మీనారాయణను సర్పంచి గెడ్డం భారతీభాస్కరావు, మాజీ జెడ్‌పిటిసి పోలిశెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపిపి అడ్డాల రాము, శ్రీకృష్ణ దేవరాయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు గోపాలకృష్ణ అభినందించారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అత్తిలి

ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి చర్యలు ఉండటం లేదని, ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు అన్నారు. పాలిలో పంట కాలువలో పని చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారితో కొద్దిసేపు ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీలో చేసిన పనికి వేతనాలు సకాలంలో చెల్లించడం లేదని, దీంతో ఆర్థికంగా పలు ఇబ్బందులు పడుతున్నామని, కూలి సొమ్ము వెంటనే వచ్చేలా చూడాలని కూలీలు వాపోయారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషిస్తూ రెక్కల కష్టమే ఆధారంగా జీవిస్తున్న గ్రామీణ కూలీలకు ప్రతి 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించాలన్నారు. చట్టంలో ఈ నిబంధన ఉన్నప్పటికీ వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం ఆలసత్వం వహిస్తుందని విమర్శించారు. జగన్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వాల మాదిరిగానే కొద్దిపాటి సంక్షేమ పథకాలతో సరిపుచ్చుతుందని తప్ప సమగ్ర చర్యలకు పూనుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో దాయం వెంకన్న, సికిలే రత్నకుమారి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, వేడంగి చిన్నారి, కడలి అంజమ్మ, వీరవల్లి దుర్గ, పంపన నాగదుర్గ పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో కోకోనట్, ఎఎస్ఎన్ఎం జూనియర్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను జిల్లా కలెక్టర్ ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత చెందడానికి మోడల్ పేపర్లను అందజేయడం, చదివినది రాయించడం తదితర ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.పెద్దిరాజు, ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖాధికారి ఎస్.అబ్దుల్ రహీమ్, హౌసింగ్ డిఇ ఆర్.త్రిమూర్తులు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెజ్లర్లను వేధించిన ఎంపీని అరెస్టు చేయాలి

వివిధ సంఘాల ఆధ్వర్యాన నిరసన

నినదిస్తున్న వివిధ సంఘాల నేతలు

ప్రజాశక్తి - భీమవరం

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణసింగ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక ప్రకాశం చౌక్‌లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ అధ్యక్షతన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీపై చర్యలు కోరుతూ మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు మాట్లాడుతూ రెజ్లర్లు ఇచ్చిన ఫిర్యాదుపై కనీసం విచారించి ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం దారుణమన్నారు. సిఐటియు జిల్లా నాయకులు బి.ఆంజనేయులు మాట్లాడుతూ బిజెపి దుర్మార్గ పరిపాలనకు చరమ గీతం పడాలన్నారు. తక్షణమే మోడీ ప్రభుత్వం స్పందించి బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.సత్యనారాయణ మాట్లాడుతూ బ్రిజ్‌భూషణ్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ప్రమోద్, ఎస్ఎఫ్ఐ నాయకులు యు.వినోద్, పి.మోహిని, బి.గణేష్, ఎం.శివ, సిహెచ్.శాంతి, ఐ.షరానో, పల్లవి, జాను, అర్జున్, దినేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఎమ్‌డి జి.వీరపాండ్యన్

వివరాలు తెలుసుకుంటున్న వీరపాండ్యన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డిఎం జి.వీరపాండ్యన్ ఆదేశించారు. మండలంలోని నవాబ్‌పాలెం రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఎల్.అగ్రహారం శ్రీనివాస రైస్ మిల్లును మంగళవారం ఆయన జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇప్పటివరకూ ఎంత మంది రైతులు వచ్చారు, ఎంత ధాన్యం కొనుగోలు చేశారని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరపాండ్యన్ మాట్లాడుతూ రవాణాలో ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ధాన్యంకు మద్దతు ధర కల్పించి రైతుల నుండి ఎవరైనా, ప్రయివేట్ వ్యక్తులైన ధాన్యాన్ని కొనుగోలు చేయవచ్చని అన్నారు. ఆర్‌బికెల్లో గన్ని బ్యాగులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. రైస్‌మిల్లుల్లో సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎస్.సరోజ, సివిల్ సప్లయిస్ డిఎం టి.శివరామప్రసాద్, తహశీల్దార్ వి.అప్పారావు, వ్యవసాయ శాఖాధికారి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలివ్వాలని ఆశాల ధర్నా

ప్రజాశక్తి - ఆకివీడు

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, పని భద్రత కల్పించాలని సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. మంగళవారం పెదకాపవరం పిహెచ్‌సి వద్ద తోట పద్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో తవిటి నాయుడు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన ప్రాణాలు కోల్పోయిన వారికి ఇప్పటికీ ముఖ్యమంత్రి ప్రకటించిన బీమా సౌకర్యం అమలు జరగలేదన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. ఆశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో మార్తమ్మ, నాగలక్ష్మి, సౌందర్య, విజయలక్ష్మి, వెంకమ్మ, భవాని పాల్గొన్నారు.

ధర్నాలో నినదిస్తున్న ఆశాలు

తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనాలని ధర్నా

తడిచిన ధాన్యం రాశి వద్ద నినదిస్తున్న రైతులు, నేతలు

ప్రజాశక్తి - ఇరగవరం

గోనెసంచులు అందించి, తేమశాతం 17 వచ్చిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇరగవరం మండలం కాకిలేరులో ధాన్యం రాశుల వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లడతూ వాతావరణ మార్పులతో తల్లడిల్లుతున్న కౌలు, పేద రైతులు గోనె సంచులు అందక, రైతుభరోసా సిబ్బంది నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కాకిలేరు రైతుభరోసా అధికారులు తేమశాతం 14,15 వస్తేనే పడతామని చెబుతున్నారని, మరోపక్క మిల్లర్లు ఆరుదల శాతం ఎక్కువున్నా ధాన్యం ముక్కైపోతుందని రైతుల వద్ద రూ.70 నుండి రూ.100 వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే గోనెసంచులు అందించి, తేమశాతం సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కౌలురైతులు బుడితి చంద్రరావు, జవ్వాది రాంబాబు, తోట వెంకటరమణ, గుడాల శ్రీనివాస్, చెల్లింకి సత్యనారాయణ, ఉన్నమట్ల నర్సింహమూర్తి, తోట శాంతి, చంటమ్మ, యాండ్ర పాపారావు పాల్గొన్నారు.

నినదిస్తున్న రైతులు, నేతలు

ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలి

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకుని, ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిగూడెం రూరల్ మండలంలోని బంగారుగూడెం, వీరంపాలెం, పట్టిన్నపాలెం గ్రామాల్లో రైతు, వ్యకాస నేతలు పర్యటించారు. తడిచిన ధాన్యం, మొక్కజొన్న రాశులను పరిశీలించి రైతుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ పంట చేతికొచ్చేసరికి అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయామన్నారు. తడిసి మొక్కలు వచ్చిన ధాన్యాన్ని చూపిస్తూ ప్రభుత్వం తమను ఆదుకోకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోతామని వాపోయారు. దీనిపై చింతకాయల బాబూరావు మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ఇబ్బందులు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ వెంటనే ఆ ప్రాంతంలో పర్యటించి రైతులను ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని, క్వింటాలుకు రూ.2500 ఇచ్చి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుసంఘం మండల కార్యదర్శి పాల్వారి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోకపోతే రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఎకరాకు 110 గోనె సంచులివ్వాలన్నారు. కార్యక్రమంలో తల్లిబోయిన శ్రీను, జాస్తి వెంకటరావు, సత్యనారాయణ, మేకా సీతయ్య, కాశగాని సూర్యచంద్రరావు, ముప్పిడి సీతారామరెడ్డి, సుంకర వెంకటరావు, జాస్తి శివరామకృష్ణ, అచ్యుత రామారావు పాల్గొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని తడిచిన రాశుల వద్ద రైతులు నినదించారు. రైతుల ఆందోళనకు భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు పూరెల్ల కృష్ణ, సకినాల అచ్చయ్య, పెనుగొండ శ్రీనివాసు మంగరాజు సంఘీభావం తెలిపారు.

తడిచిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

రైతులను నట్టేట ముంచిన అకాల వర్షం

ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

గత సార్వాలో సంచులు, సొమ్ము రాక రైతులు ఇబ్బందులు పడితే దాళ్వాలో అకాల వర్షం రైతులను నట్టేట ముంచిందని కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. అకాల వర్షాల కారణంగా చేతికొచ్చిన పంట నీటి పాలైందన్నారు. అకాల వర్షాల వల్ల పంట దెబ్బతిన్న రైతులను గోపాలన్ మంగళవారం కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమయానికి బరకాలు లేకపోవడంతో ధాన్యం తడిచి ముద్దయిందని రైతులు తెలిపారు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి అదనపు ఖర్చవుతుందని వాపోయారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు చెప్పారు. దీనిపై గోపాలన్ స్పందించి మాట్లాడుతూ రైతుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, మనోధైర్యం కోల్పోవద్దని, ప్రభుత్వంపై పోరాడుదామని అన్నారు. కార్యక్రమంలో రైతులు ఆళ్ల శ్రీనివాసు, కునుపూడి శ్రీనివాస్, తోరం నాగేంద్ర, ఆళ్ల మహంకాళి, ఎస్.రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎంపిటిసి దంపతులపై దుండగుల దాడి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ వైసిపి ఎంపిటిసి సభ్యులు బలం రామలక్ష్మిపై ఆమె భర్త పెద్దిరాజుపై ఇద్దరు దుండగులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... ఎంపిటిసి సభ్యులు రామలక్ష్మి, ఆమె భర్త పెద్దిరాజు బైక్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం సొమ్మెమ చెరువు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మునమర్రు వద్దకు వచ్చేసరికి ఇద్దరు దుండగులు కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో గాయాలపాలైన వారిని స్థానికులు తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు గాయాలపాలైన భార్యాభర్తలను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పెనుగొండ ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

మండలంలోని యర్రాయిచెరువు గ్రామ పంచాయతీకి ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్న చెరువుగట్టుపై అనాధికార నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అందుకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని యర్రాయిచెరువు గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ సూర్యనారాయణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చెరువుగట్టుపై ఐదు కొబ్బరిచెట్లను గ్రామ సర్పంచి కేతా వెంకటలక్ష్మి భర్త కేతా సత్యనారాయణ నరికించారని, దీనిపై అడిగిన గ్రామ పెద్దలపై, గ్రామస్తులపై దుర్భాషలాడారని చెప్పారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలా నాగలక్ష్మి, వేంద్ర హేమామ్రీ, వి.పార్వతి, వి.రత్నకుమారి, వి.శ్రీనివాస్, వి.ప్రసాద్, రాఘవ, సత్యనారాయణ, శివగోవిందా, దానేశ్వరరావు పాల్గొన్నారు.

'సూర్య' విద్యార్థులకు ముదునూరి అభినందన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం శ్రీ సూర్య కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారు. వారిని పుష్పగుచ్ఛాలతో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు అభినందించారు. శ్రీ సూర్య కళాశాల విద్యార్థులు ఇంటర్ మొదటి, రెండో సంవత్సర విద్యార్థులు నరసాపురం పట్టణ ప్రథమ, స్టేట్ ర్యాంకులు సాధించడం సంతోషకరమన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం పురపాలక సంఘం పరిధిలోని రెండో వార్డులో జనరల్ నిధులు రూ.4.99 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి వెంకటరమణజయరాజు ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమెతో పాటు మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆర్‌టిసి ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులు చేస్తున్న సేవలను పలువురు అభినందించారు.

వశిష్ట లియోక్లబ్‌కు ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గవర్నర్ కాన్వన్షన్ బ్యానర్ ప్రెజెంటేషన్ విభాగంలో తాడేపల్లిగూడెం వశిష్ట లియోక్లబ్‌కు ప్రత్యేక ప్రతిభా అవార్డును జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ పంక జాక్షన్ ప్రకటించారు. మంగళవారం నిర్వహించిన గవర్నర్ కన్వన్షన్లో పలు క్లబ్స్ తమ బ్యానర్ ప్రెజెంటేషన్ జరిపాయి. తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ వారితో నూతనంగా ఏర్పాటు చేసిన వశిష్ట లియో క్లబ్ యూనిఫాం ధరించి క్రమశిక్షణతో తమ ప్రదర్శన చేయడంతో బ్యానర్ ప్రెజెంటేషన్ కమిటీ లియో క్లబ్స్ కేటగిరిలో అవార్డు ప్రకటించి గవర్నర్ చేతులమీదుగా క్లబ్ అడ్వైజర్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అధ్యక్షురాలు లియో మాధురి టీమ్‌కు జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి వంకా రవీంద్ర నాథ్, ఎలక్టడ్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, డైమండ్స్ లయన్స్ రామాకుమారి, డాక్టర్ కమల పాల్గొన్నారు.

శివాజీ వాలీబాల్ అకాడమీ ఏర్పాటు

ప్రజాశక్తి - కాళ్ల


వాలీబాల్ అడకామీ సభ్యులు

కోపల్లె గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు శివాజీరాజు పేరుతో శివాజీ వాలీబాల్ అకాడమీని మంగళవారం ఏర్పాటు చేశారు. కోపల్లె ఎస్ఎండిఆర్ఆర్ జెడ్‌పి హైస్కూల్లో వాలీబాల్ టోర్నమెంట్ కమిటీని నియమించారు. జిల్లాలో ఉన్న గ్రామాల్లో యువతకు వాలీబాల్ కిట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో పి.విశ్వనాధరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, కొత్తపల్లి బంగార్రాజు, గాదిరాజు కనకరాజు, వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు దంతులూరి శివాజీరాజు, దంతులూరి ప్రభాకరరాజు, శ్రీనివాసరాజు, వి.రామరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఉండి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని కలిగొట్ల సచివాలయ పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ మాజీ ఛైర్మన్ చింతలపాటి సత్యానంద శ్రీహరిరాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు చింతలపాటి రఘుపతి రాజు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నాయకులు గులిపల్లి అచ్చారావు, గంద్రాజు రాజేష్‌వర్మ, రుద్రరాజు వెంకట సుబ్బరాజు, సాగిరాజు రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

బాలల చిత్రకళా పోటీల్లో తణుకు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు రూరల్

విజయవాడ డ్రీమ్ యూత్, చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన బాలల చిత్రకళా పోటీల్లో తణుకు జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ అంశాలను తీసుకుని చిత్రాలుగా మలిచి బంగారు, వెండి పతకాలు సాధించారని చిత్రకళా ఉపాధ్యాయులు డాక్టర్ వెంపటాపు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట సూర్యవెంకటవిశ్వేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఆల్ ఇండియా బాల చిత్రకళా అవార్డ్ ఆరో తరగతి విద్యార్థి ఎన్.కుశల్‌ఈశ్వర్‌కుమార్ సాధించగా, 15 మందికి గోల్డ్ మెడల్స్, పది మంది సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. విశేష ప్రతిభ కనబరిచిన బాలలను, చిత్రకళా ఉపాధ్యాయులు వెంపటాపును ప్రధానోపాధ్యాయులు సూర్యవెంకటవిశ్వేశ్వరప్రసాద్, టి.ఉమ, ప్రభువరం, కనకదుర్గేశ్వరి, జి.సీతామహాలక్ష్మి, వి.శైలజ, కాశీ, వీరభద్రం, అక్కిశెట్టి రాంబాబు, పెద్దిరాజు, పాపారావు, రాధ, షీలా, సురేంద్ర, విద్యాకమిటీ అధ్యక్షులు సంభాన శ్రీనివాస్ అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో మార్చి 27న నిర్వహించిన పాలకొల్లు డివిజన్ స్థాయి ప్రతిభాపాటవ పరీక్షలో విజేతలైన విద్యార్థులకు సోమవారం స్థానిక ఎంఎంకెఎన్‌ఎం హైస్కూల్లో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. సభకు సంస్థ కోశాధికారి జవ్వాది నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ హాజరయ్యారు. విశిష్ట అతిథిగా మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ సిహెచ్.బాబ్జి హాజరయ్యారు. అతిథులుగా కొంతేరు జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం కానుకోన శ్రీనివాసరావు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్న సమాఖ్యను అభినందించారు. విద్యార్థులు అత్యున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించడానికి విశేషంగా కషి చేయాలన్నారు. డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలు లక్ష్యంగా తీసుకుని చదవాలని సూచించారు. ఎక్కడ చదివామన్నది ముఖ్యం కాదని, ఎలా చదివామన్నది ముఖ్యమని అన్నారు. రూ.40 వేల విలువైన నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించామని సభాధ్యక్షులు అన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రామిరెడ్డి జీవితం ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితం

వర్ధంతి సభలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

రామి రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాబ్జీ

ప్రజాశక్తి - భీమవరం

అమరజీవి దాచారి రామిరెడ్డి తన జీవితాన్ని ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితం చేశారని ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. భీమవరంలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో అమరజీవి దాచారి రామిరెడ్డి జిల్లా స్థాయి వర్ధంతి వేడుక మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన షేక్ సాబ్జీ మాట్లాడుతూ రామిరెడ్డి ప్రజలతో మమేకమై పేదపిల్లల విద్యకోసం పాటుపడ్డారని తెలిపారు. ఉమ్మడి శాసనమండలి సభ్యునిగా, శాసన మండలి రద్దు అయి మళ్లీ పునరుద్ధరించిన తరువాత తిరిగి టీచర్స్ ఎంఎల్‌సిగా ఎన్నికయ్యారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన గౌరవ వేతనం ప్రజా ఉద్యమాలకు ఇచ్చి, ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాన్ని నిరాకరించిన ఆదర్శ ప్రాయుని కొనియాడారు. తన చివరి ఆస్తి, ఇంటిని కూడా అమ్మి ప్రకాశం జిల్లా యుటిఎఫ్‌కి ఇచ్చారన్నారు. అలాంటి నాయకుని ఆశయాలను మనం ముందుకు తీసుకెళ్లాలని, ఆయన సాధించి పెట్టిన సదుపాయాలు విద్యాలయాల ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి మాట్లాడుతూ, రామిరెడ్డి 25 ఏళ్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా పని చేశారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. ప్రజాసమస్యలపై శాసన మండలిలో అనేక సమస్యలను లేవనెత్తి, ప్రభుత్వంతో పోరాడేవారన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామభద్రం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవటమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మార్కండేయ, అసోసియేట్ అధ్యక్షులు రాజశేఖర్, శ్రీదేవి, కోశాధికారి పట్టాభిరామయ్య, క్రాంతికుమార్, లక్ష్మీనారాయణ, జయకుమార్, సాయిరామ్, రామకృష్ణంరాజు, రామకృష్ణ, ప్రసాద్ యేసుబాబు, రామానుజరావు రాజ్యలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

పలుగ్రామాల్లో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దగ్గులూరు, అగర్రు గ్రామాల్లో మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రైస్ మిల్లుల నుంచి ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎక్కడా ధాన్యం కొనుగోలుకు అంతరాయం లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం చందపర్రు గ్రామం జగనన్న లే అవుట్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.పెద్దిరాజు, ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అబ్దుల్ రహీమ్, గృహ నిర్మాణ శాఖ డిఇఆర్ త్రిమూర్తులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

'మిల్లర్లే దళారులు'

ప్రజాశక్తి - వీరవాసరం

దళారి వ్యవస్థను రూపుమాపడానికి తీసుకొచ్చిన నూతన ధాన్యం కొనుగోలు విధానం మిల్లర్లనే దళారులుగా ప్రోత్సహించేలా ఉందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ అన్నారు. మంగళవారం వీరవాసరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో రైస్‌మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నా ఎస్ఇబి పోలీసులు వారిపై ఎందుకు నిఘా పెట్టడంలేదని ఆయన ప్రశ్నించారు. తక్షణమే రైసుమిల్లుల వద్ద జరుగుతున్న మాఫియాపై ఎస్ఇబి దృష్టిపెట్టి రైతులను ఇబ్బందిపెడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ ఉప విద్యాశాఖాధికారి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఉండి

సౌమ్యుడుగా పేరు తెచ్చుకున్న మాజీ ఉప విద్యాశాఖధికారి మద్దూరి సూర్యనారాయణమూర్తి (65) మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆయన చేసిన సేవలను, ఆయనతో అనుభవాలను రాష్ట్ర బియిడి ఉపాధ్యాయ సంఘం మాజీ గౌరవ అధ్యక్షులు గాదిరాజు రంగరాజు పంచుకున్నారు. మండల విద్యాశాఖధికారిగా ఉండి మండలానికి ఇన్‌ఛార్జిగా కొంతకాలం పనిచేసి, తర్వాత పూర్తిస్థాయి ఎంఇఒగా పని చేశారన్నారు. తాడేపల్లిగూడెం, భీమవరం ఉప విద్యా శాఖ అధికారిగా పనిచేసి 2018లో ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఎన్నో సార్లు ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారని తెలిపారు. ఆయన పాఠశాలల సందర్శన సమయంలో విద్యార్థులకు గణితం బోధించేవారని, జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు అడిగేవారని చెప్పారు. ఆయన మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

అకాల వర్షాలకు కోత దశలో ఉన్న వరి పంటల రైతులు తప్పసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరత లక్ష్మి అన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె మంగళవారం వివరించారు. గింజ గట్టిపడే దశ నుంచి కోత దశలో చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాల్లో నష్టం తక్కువగా ఉంటుంన్నారు. నిద్రావస్థ లేని రకాలు నీట మునిగితే కంకి పైనే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. కొన్ని నిద్రావస్థ కలిగిన రకాల్లో కూడా చేను పడిపోయి వారం రోజులు కన్నా ఎక్కువగా నీటిలో మునిగినట్లయితే గింజల్లో నిద్రావస్థ తొలగి చేనుపైనే మొలకెత్తి అవకాశం ఉందన్నారు. కుప్ప వేసే సమయంలో పనలు తడిస్తే ఎకరాకు 25 కిలోల ఉప్పు పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టం నివారించవచ్చని చెప్పారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

పెనుమంట్ర :ఆశా వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు లేనప్పుడు రిటైర్‌మెంట్ ఎలా వర్తిస్తుందని ఆశావర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి దిగుపాటి జ్యోతి అన్నారు. మే డేను పురస్కరించుకుని మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో పార్టీ జెండాను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, మెటర్నటీ సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సంక్షేమ పథకాలు అమలు చేసి కార్మికులుగా గుర్తించి కనీస వేతన సదుపాయం కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మార్టేరు శాఖ కార్యదర్శి నేదూరి హనుమంతరావు సీత పాల్గొన్నారు. పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు ప్రశాంతి కుమారి సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, మేక వెంకటేశ్వరరావు, సంతోషి, సత్య శారద, మణికుమారి, మేరి పాల్గొన్నారు.

పింఛనుదారులకు ఇకెవైసి తప్పనిసరి

జిల్లా ట్రెజరరీ అధికారి అడారి గణేష్

ప్రజాశక్తి - భీమవరం


అడారి గణేష్

విశ్రాంత ఉద్యోగ ఫించనుదారులందరూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల పదో తేదీ లోపు ఇ-కెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ట్రెజరరీ అధికారి అడారి గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పింఛనుదారులు తమ సిఎఫ్ఎంఎస్ ఐడికి ఆధార్ కార్డుతో అనుసంధానమైన ఫోన్ నెంబర్‌ను, ప్రస్తుత నివాస చిరునామను విధిగా నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. అప్పటి ఫోన్ నెంబర్ అందుబాటులో లేకపోతే ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఫోన్ నెంబర్‌ను ఆధార్‌తో అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. అనంతరం జిల్లాలోని ట్రెజరరీ కార్యాలయాలకు, పెన్షనర్ అసోసియేషన్ కార్యాలయాలకు వెళ్లి ఇ-కెవైసి చేయించుకోవాలని తెలిపారు. దీనివల్ల ప్రతి విశ్రాంత ఉద్యోగికి సాంకేతికతతో కూడిన ఆర్థిక భద్రత ఉంటుందన్నారు. ఇ-కెవైసి పూర్తయితే పింఛనుదారులకు సంబంధించిన ప్రతి సమాచారం ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. పింఛనుదారులు ఇ-కెవైసి నమోదుకు ఉపఖజానా అధికారులు భీమవరం 6302618446, ఆకివీడు 9505053723, నరసాపురం 7386859749, పాలకొల్లు 9505039748, పెనుగొండ 9951602137, తాడేపల్లిగూడెం 9491821365, తణుకు 8341225044 సంప్రదించాలని తెలిపారు.

ఆర్‌టిసి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఆర్‌టిసి అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆర్‌టిసి చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. నరసాపురం ఆర్‌టిసి డిపోను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు నిబంధనల ప్రకారం బస్సులను నడపాలన్నారు. డ్రైవింగ్‌లో చెడు అలవాట్లను, సెల్‌ఫోన్ మాట్లాడటం మానుకోవాలని చెప్పారు. తిరుమలలో కొత్తగా విద్యుత్ బస్సులను ప్రారంభించి నడుపుతున్నామని, ఈ ప్రాంతాల్లో కూడా త్వరలో నడిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విద్య, వైద్య సంస్థలనే కాకుండా ఆర్‌టిసి బస్టాండ్‌లను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. చనిపోయిన కార్మికుల కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొన్ని నిబంధనలను సరళీకృతం చేసి కారుణ్య నియామకాలను చేపట్టామన్నారు. డిపో పరిస్థితిపై డిపిటిఒ ఎ.వీరయ్య చౌదరి వివరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, నగదు అందించారు. గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి, కార్మిక సంఘాల నాయకులు, సూపర్ వైజర్స్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు కలెక్టరేట్ మార్గ్ పేరు : గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బైపాస్ రోడ్డుకు కలెక్టరేట్ మార్గ్‌గా నామకరణం చేయడానికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రానున్న రోజుల్లో మార్కెట్ యార్డులో కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఈ బైపాస్ రోడ్డు ప్రజలకు చాలా కీలకంగా మారుతుందన్నారు. రూ.3.65 కోట్ల నిధులతో బైపాస్ రోడ్డును జడ్డు బ్రహ్మజీ కళ్యాణ మండపం వద్ద నుంచి బివి.రాజు బొమ్మ వరకు నిర్మించిన సీసీ, బీటీ రోడ్డును ఎంఎల్‌ఎ గ్రంధి మంగళవారం ప్రారంభించారు. అనంతరం సిఎస్‌ఆర్ ఫండ్స్ నిధులు కింద లయన్స్ క్లబ్‌తో కలిసి రూ.20 లక్షలతో ఏర్పాటు కానున్న బైపాస్ రోడ్డులో క్లాక్ టవర్, పోలీస్ అవుట్ పోస్ట్, కంట్రోల్ ఫ్లడ్ లైటింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరం జిల్లా కేంద్రమైన నేపథ్యంలో పట్టణాన్ని పూర్తిస్థాయిలో సుందరీకరణను చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కలెక్టరేట్ త్వరలో మార్కెట్ యార్డులో ఏర్పాటు కానున్న నేపథ్యంలో బైపాస్ రోడ్డును రూ.3.65 కోట్లతో సిసి, బీటీ రోడ్డుగా ఆధునీకరించినట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, లయన్స్ క్లబ్ ముందుకు వచ్చి అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌సిలు వంకా రవీంద్రనాథ్, కౌవురు శ్రీనివాస్ సహకారంతో పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ భీమవరం విద్య, వైద్య, వాణిజ్య రంగాల్లో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విదేశాల నుంచి కూడా ఇక్కడికి ప్రముఖులు వచ్చే అవకాశం ఉందని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భీమవరం జిల్లా కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర రైతు స్టీరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని దువ్వ జాతీయ రహదారి వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఉన్న కల్లాలను, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను రాష్ట్ర రైతు స్టీరింగ్ కమిటీ సభ్యులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తోట సీతామాలక్ష్మి మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు మర్రిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలతో నష్టపోయి బాధపడుతున్న రైతులను తణుకు నియోజకవర్గంలో ఉన్న పౌర శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇప్పటివరకు పరామర్శించలేదన్నారు. రైతుల బాధలను మంత్రి అర్థం చేసుకుని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంఎల్‌ఎ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో మూడు నెలలకు ముందుగానే ఇ క్రాప్ చేయించిన్న అన్ని ఎకరాలకు సరిపడా సంచులు పంపలేదన్నారు. పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ సంచుల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పాతూరి రాంప్రసాద్ చౌదరి, తణుకు నియోజకవర్గ అధ్యక్షులు నల్ల భాస్కరరావు, అత్తిలి మండల అధ్యక్షులు ఆదినారాయణ, తణుకు మండల అధ్యక్షులు పితాని మోహన్, నరసాపురం పార్లమెంటు ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, నరసాపురం పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు సాయిబాబా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ సిటీగా భీమవరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని, ఇందుకు సహకరిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రెండో పట్టణంలోని అడ్డ వంతెన వద్ద ఉన్న సర్ ఆర్థర్ కాటన్ పార్కుకు కాస్మో పాలిటిన్ క్లబ్ తరపున రూ.25 లక్షల సహకారంతో సుందరీకరణ చేసే పనులకు కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం జిల్లా కేంద్రమైన నేపథ్యంలో కలెక్టర్‌గా వచ్చిన పి.ప్రశాంతి మున్సిపాలిటీకి కూడా ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో పట్టణ అభివృద్ధికి కలెక్టర్ పి.ప్రశాంతి తన వంతు సహకారం అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, కాస్మో పాలిటిన్ క్లబ్ అధ్యక్షులు అల్లూరి పద్మరాజు, పెనుమత్స వెంకటరామరాజు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఎంఇ త్రినాధరావు, డిఇ తోట నారాయణరావు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఎఎస్.రాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్ద గోపురం సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పెద్ద గోపురం సెంటర్‌లో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శ్రీ క్షీనా రామలింగేశ్వర స్వామి ఆలయం ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి రోజు ప్రజలకు రస్నా అందించారు. వేసవి పూర్తయ్యేవరకు ఈ చలివేంద్రం నిర్వహించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వణాధికారి యాళ్ల సూర్యనారాయణ, కనకదుర్గ ఆలయ ఛైర్మన్ కావలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులో మంటలు

బస్సులో నుంచి వస్తున్న మంటలు

త్రుటిలో తప్పిన ప్రమాదం
15 మంది ప్రయాణికులు సురక్షితం
శృంగవృక్షంలో ఘటన

ప్రజాశక్తి - పాలకోడేరు

216 జాతీయ రహదారిలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఆర్‌టిసి బస్సు ఇంజన్‌లో మంటలు రావడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. బస్సు వెనుక వస్తున్న ప్రయాణికులు మంటలు గుర్తించి ప్రయాణికులను బస్సు నుంచి కిందకు దింపడంతో 15 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని శృంగవృక్షంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... భీమవరం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు మంగళవారం భీమవరం నుంచి అమలాపురం 15 మంది ప్రయాణికులతో బయల ుదేరింది. విస్సాకోడేరు సమీపంలోకి వచ్చేసరికి బస్సు నుంచి పొగలు వచ్చాయి. ఈ విషయాన్ని వెనకవచ్చే ద్విచక్ర వాహన చోదకులు గుర్తించారు. ఈ విషయాన్ని డ్రైవర్‌కు చెప్పేందుకు ఎంత ప్రయత్నించినా ట్రాఫిక్ రద్దీగా ఉండడంతో వీలు పడలేదు. చివరకు శృంగవృక్షం వద్ద విషయాన్ని డ్రైవర్‌కు తెలియపరచడంతో ఆర్‌టిసి డ్రైవర్ బికె.మూర్తి బస్సును వెంటనే నిలిపి వేసి దానిలో ప్రయాణిస్తున్న ప్రయాణికులను కిందికి దింపివేశారు. ఇదే సమయంలో బస్సు ఇంజను భాగం వద్ద నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ స్థానికుల సహాయంతో మంటలను అదుపుచేశారు. భీమవరం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తిస్థాయిలో మంటలను అదుపు చేశారు. బస్సు బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ అవ్వడం వల్ల మంటలు చెలరేగాయని భీమవరం అగ్నిమాపక శాఖ అధికారి సూర్యచంద్రరావు తెలిపారు. రూ.1.50 లక్షల ఆస్తినష్టం జరిగిందన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లలో మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. జక్కరం పంచాయతీ కార్యదర్శి షేక్ జమాల్ అధ్యక్షులుగా, కాళ్ల పంచాయతీ కార్యదర్శి బళ్ల సతీష్ కుమార్ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. బొండాడ పేట పంచాయతీ కార్యదర్శి చెన్ను సుజాత కార్యదర్శిగా, ప్రాతళ్లమెరక పంచాయతీ కార్యదర్శి బస్వాని ఏసుబాబు ట్రెజరర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొండాడ పంచాయతీ కార్యదర్శి దొంగ సత్యనారాయణ గౌరవ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

అకాల వర్షాలతో కుదేలైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామాంజనేయరాజు (రామరాజు) అన్నారు. అధిక వర్షానికి ముంపునకు గురైన నరసాపురం మండలంలోని మల్లవరం, మల్లవరంలంక, కొప్పర్రు గ్రామాల్లోని వరి పొలాలను రామరాజు సందర్శించి మాట్లాడారు. ఒకవైపు పండించిన పంటకు మద్దతు ధర లేక అల్లాడుతుంటే, మరోవైపు అకాల వర్షాలకు పండించిన పంట నీట మునిగి రైతులకు పూర్తిగా నష్టపోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వరరావు, తంగెళ్ల నాగేశ్వరరావు, సంది నరసింహరావు, ముక్కు బాబురావు, పోతినీడి ముసలయ్య, పెచ్చెట్టి ఏసుబాబు, వెంకన్న, కవురు ఏసుబాబు, త్రిమూర్తులు, మురళి, తిరుమాని హేమంత్, ప్రశాంత్, మైల వీరాస్వామి, విజయరాజు, షేక్ అలీషా పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

గుత్తి ఉమా మహేశ్వరరావు, తండ్రి: వీర వెంకట సత్యనారాయణ అను నేను నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ : **R1855848** గల పాస్‌పోర్టు రామన్నపాలెం నుండి పెనుగొండ వస్తుండగా పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
గుత్తి ఉమా మహేశ్వరరావు
తండ్రి: వీర వెంకట సత్యనారాయణ
డోర్ నెంబర్: 3-39/1, మధ్యపాలెం,
రామన్నపాలెం, పెనుగొండ మండలం
ప॥గో॥జిల్లా, సెల్: 9550977910

పాస్‌పోర్టు పోయినది

జక్కంశెట్టి సర్వేశ్వరరావు, తండ్రి: నాగేశ్వరరావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఏలేటిపాడు నుండి పేకేరు వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు నెంబర్: **L7692685** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
జక్కంశెట్టి సర్వేశ్వరరావు
తండ్రి: నాగేశ్వరరావు, డోర్ నెం. 3-107
నిట్లావారి తోట, పేకేరు,
ఇరగవరం మండలం, ప॥గో॥జిల్లా,
పిన్: 534320, సెల్: 8096727817

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ఫస్ట్ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో
C.C. No. 1171/2021

బిట్వీన్:
నరావుల శ్రీనివాసరావు -ఫిర్యాది
మరియు
బండి అమ్మాజి -ముద్దాయి

ముద్దాయి: బండి అమ్మాజి, W/o. బండి నాగ వెంకట సత్తిబాబు, వయసు 50, హిందూ, స్త్రీ, ఉద్యోగి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసు, సజ్జాపురం, తణుకు - 534211.

పై కేసులో ముద్దాయి అయిన మీరు పై చిరునామాలో వుంటూ సమన్లు తీసుకొనక తప్పించుకు తిరుగుచున్నందు వలన ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, పై కేసులో మీ హాజరు కొరకు **ది. 09-05-2023వ తేదీన వాయిదా అయి వున్నది. సదరు తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలసినది. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
జి.శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ
తాడేపల్లిగూడెం ఫిర్యాది తరపు న్యాయవాది
ది. 01-05-2023 తాడేపల్లిగూడెం

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
ఇ.పి. నెం. 28/2022
ఒ.యస్. నెం. 221/2015

బిట్వీన్:
ది పశ్చిమగోదావరి జిల్లా జూడిసియల్ ఎంప్లాయిస్ మ్యూట్యువల్లి ఎడెడ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, ఏలూరు, రిప్రెజెంటెడ్ ఇట్స్ ప్రెసిడెంటు -డిక్రీ హోల్డర్
మరియు
విసుమూర్తి శ్రీనివాస్ మరియు వగయిరా -జడ్జిమెంట్ డెటార్స్

డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల ఇ.పి.లో 1వ జడ్జిమెంట్ డెటార్ అయిన విసుమూర్తి శ్రీనివాస్, S/o. కృష్ణమూర్తి రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్, పి.జె.సి.జె.సి. మిలట్రీ కాంటిన్, మోతేవారితోట, రోడ్ నం.7, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 20-6-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొన వచ్చును. లేని ఎడల సదరు వారంటు గ్రంధము ఏకపక్షముగా విచారణ చేయుదురుని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ, అడ్వకేట్స్
ఏలూరు అశోక్‌నగర్, ఏలూరు, ఏలూరు జిల్లా
ది.23-4-23 సెల్:9989089289